క్లుప్తంగా

మాజీ సీఎం జగన్‌ను కలసిన ఆలూరు



జగన్‌మోహన్‌రెడ్డితో సాంబశివారెడ్డి

శింగనమల: లండన్ పర్యటన ముగించుకొని వచ్చిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం బెంగుళూరులో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలూరు సాంబశివారెడ్డి కలిశారు. జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

వైఎస్సార్‌సీపీని బలోపేతం చేద్దాం



మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని సత్కరిస్తున్న పెద్దపేట లక్ష్మీదేవి

యాడికి: వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసేందుకు అందరం సమష్టిగా కృషి చేద్దామని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలిగా నియామకమైన యాడికి మండలం పెద్దపేట గ్రామానికి చెందిన లక్ష్మీదేవి శుక్రవారం యల్లనూరు మండలం తిమ్మంపల్లిలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని కలిశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ మాజీ ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. తాడిపత్రిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగుర వేసేందుకు రెట్టింపు ఉత్సాహంతో పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తామని లక్ష్మీదేవి తెలిపారు.

జీవాలపై అప్రమత్తంగా ఉండాలి



మేకకు నట్టల నివారణ మందు అందిస్తున్న వెటర్నరీ సిబ్బంది

శింగనమల: పశువులు, మేకలు, గొర్రెలకు జబ్బులు సోకకుండా కాపరులు అప్రమత్తంగా ఉండాలని వెటర్నరీ సహాయ సంచాలకులు డాక్టర్.పద్మనాభం సూచించారు. శుక్రవారం శింగనమలలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మేకలకు, గొర్రెలకు నట్టల నివారణ మందులు అందజేస్తున్నామన్నారు. గొర్రెలు, మేకల పెంపకందారులు అవగాహన చేసుకుని , పశుసంవర్ధక శాఖ అందిస్తున్న సేవలను ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం నాగులగుడ్డం తండా రైతు పవన్‌కుమార్ రైతుకు చెందిన ఆవుకు తోకపైన పుండు ఏర్పడి రక్తస్రావం అవుతుండడంతో, శస్త్ర చికిత్స చేశారు. కార్యక్రమంలో పశువైద్యులు డాక్టర్. కిరణ్ కుమార్‌రెడ్డి, రజియా బేగం, ఫయాజ్ బాష, హరికృష్ణ, సాయి ప్రసన్న, చంద్రశేఖర్, రంగనాయకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా భాస్కర్



శింగనమల: శింగనమల ఎంపీడీఓ నిర్మలా కుమారి పదవీ విరమణ చేయడంతో గుత్తి ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వహిస్తున్న కె.భాస్కర్‌ను ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా నియమించారు. ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కాగా శింగనమల ఎంపీడీఓ కార్యాలయంలో పనిచేస్తున్న ఈఓపీఆర్డీ, ఏఓ బాధ్యతలు తీసుకోవడానికి ముందుకు రాకపోవడంతో గుత్తి మండలంలో పనిచేస్తున్న ఏఓను ఎంపీడీఓగా నియమించారు.

విశ్రాంత ఎంపీడీఓకు సన్మానం



ఎంపీడీఓ నిర్మలాకుమారిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శింగనమల: ఎంపీడీఓ నిర్మలాకుమారి పదవీ విరమణ కార్యక్రమం శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ యోగేశ్వరి, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి, తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యల్లనూరు: తహసీల్దారు కార్యాలయంలో విధులు నిర్వహించే సీనియర్ అసిస్టెంట్ వాసుదేవరావు శుక్రవారం పదవీ విరమణ చేసిన సందర్భంగా తహసీల్దారు రాజా చేతుల మీదుగా సన్మానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు మునీంద్ర, ఆర్ఐ నారాయణమ్మ , వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ వ్యాపారుల ఆధిపత్య పోరు





ఆధిపత్య పోరు కారణంగా కిలో చికెన్ రూ.170 నిర్ణయించిన దృశ్యం



మరో షాపులో కిలో చికెన్ రూ.,200 ఉన్న బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం

- ధరల్లో భారీ వ్యత్యాసం
- చితికిపోతున్న చిరు వ్యాపారులు

తాడిపత్రి రూరల్: తాడిపత్రి ప్రాంతంలో చికెన్ సెంటర్ వ్యాపారుల మధ్య ఆధిపత్య పోరు నెలకొంది. వారి పోరు భవిష్యత్‌లో శాంతిభద్రతల సమస్యగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆధిపత్య పోరు కారణంగా ఒక్కోచోట ఒక్కో ధర ఏర్పాటు చేసి విక్రయాలు సాగిస్తున్నారు.. అనంతపురానికి చెందిన వ్యాపారులు తాడిపత్రిలో చికెన్ మార్కెట్ పెంచుకోవడానికి భారీగా ధరలు తగ్గించారు. మిగిలిన వారి కంటే కిలో రూ. 20 నుంచి రూ. 30 తగ్గించి విక్రయాలు ప్రారంభించారు. ధర తక్కువగా ఉన్నచోట ప్రజలు కొనుగోలు చేయడానికి మొగ్గు చూపడంతో కొందరు వ్యాపారులు తప్పనిసరి పరిస్థితుల్లో ధరలు తగ్గించాల్సి వస్తోంది. తాడిపత్రి పట్టణంతో పాటు పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లి కాలనీ, పెద్దపప్పూరు, యాడికి, పెద్ద వడుగూరు తదితర మండలాల్లో చికెన్ ధరల్లో ఎక్కువ వ్యత్యాసం ఉంటోంది. తాడిపత్రి పట్టణంతో పాటు గన్నెవారిపల్లి కాలనీల్లో ఒక చోట కిలో చికెన్ స్కిన్‌తో రూ.170, స్కిన్ లేకుండా రూ. 200 ఉండగా మరో ప్రాంతంలో చికెన్ కిలో స్కిన్‌తో రూ. 220, స్కిన్ లేకుండా రూ. 250ల ధరతో విక్రయిస్తున్నారు.

ఇబ్బందుల్లో చిన్న వ్యాపారులు

కొందరు వ్యాపారుల మధ్య నెలకొన్న ఆధిపత్య పోరు కారణంగా చిన్న వ్యాపారులు చితికిపోతున్నారు. ఈ వ్యాపారంపై ఆధారపడ్డ కొందరు అప్పులు తెచ్చి చికెన్ సెంటర్లను ఏర్పాటు చేసుకున్నారు. ఆధిపత్య పోరుతో భారీగా ధరలు తగ్గించడంతో మిగిలిన వ్యాపారులు ధరలను తగ్గించలేక, మార్కెట్ ధరలకు అనుగుణంగా విక్రయించలేక ఇబ్బందులు పడుతున్నారు. మాఘమాసం కారణంగా చికెన్ అమ్మకాలు గణనీయంగా పడిపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆధిపత్య పోరు చిరు వ్యాపారులకు తలనొప్పిగా మారింది. తక్కువ ధర ఉన్న చోట కొనడానికి ప్రజలు ఆసక్తి చూపుతుండటంతో చిన్న వ్యాపారులు వ్యాపారాలు లేక సతమతమవుతున్నారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు, షాపుల బాడుగలు, పనిచేసే వారికి జీతాలు, కరెంట్ చార్జీలు, అప్పుగా తెచ్చిన కోళ్లకు డబ్బు చెల్లింపు తదితర ఖర్చులకు అనుగుణంగా వ్యాపారం లేక అవస్థలు పడుతున్నారు. అలాగే ధరల్లో ఉన్న వ్యత్యాసం వల్ల ఎక్కడ కొనుగోలు చేయలో తెలియక వినియోగదారులు నష్టపోతున్నారు. నాణ్యమైన చికెన్ విక్రయాలపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎక్కువ ధరలకు విక్రయిస్తున్న చికెన్ నాణ్యమైనదిగా చెబుతూ వ్యాపారం పెంచుకోవడానికి వినియోగదారులను కొందరు వ్యాపారులు నమ్మిస్తున్నారు.

ధర తగ్గించి విక్రయిస్తున్నాం



కోళ్ల ధరలకు అనుగుణంగా చికెన్ ధరలను పెంచాలి. దీన్ని బట్టి కిలో చికెన్ ధర స్కిన్‌తో రూ.200, స్కిన్ లెస్‌తో రూ.220తో అమ్మకాలు చేయాలి. కానీ వ్యాపారాన్ని వారి వైపు తిప్పుకునేందుకు కొందరు తక్కువ ధరను నిర్ణయించడంతో నేను కూడా కిలో రూ.30 మేర తగ్గించి విక్రయిస్తున్నా.

– ప్రతాప్‌రెడ్డి, చికెన్ సెంటర్ నిర్వాహకుడు

ఆందోళనగా ఉంది



ఆధిపత్య పోరు వల్ల వ్యాపారాలు బాగా తగ్గాయి. వ్యాపారం తగ్గడంతో చికెన్ సెంటర్లలో పనిచేసే మాలాంటి కూలీలకు ఎక్కడ ఉపాధి పోతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. రోజుకు రూ.450 కూలి వస్తోంది. ఉపాధి పోతే కుటుంబం ఇబ్బందుల్లో పడుతుంది.

– హాజీ, చికెన్ సెంటర్‌లో కూలీ

నాణ్యతపై అనుమానం



ధరల్లో వ్యత్యాసం ఉండటంతో ఎక్కడ చికెన్‌ను కొనుగోలు చేయాలో తెలియడం లేదు. ఒక్కో ప్రాంతంలో ఒక ధర ఉంటోంది. ఇందులో ఎక్కడ నాణ్యత కలిగిన చికెన్ ఉందో అర్థం కావడం లేదు. తుకాల్లో మోసం జరుగుతుందన్న అనుమానాలు కూడా ఉన్నాయి.

– క్రిష్ణ, వినియోగదారుడు

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ కౌలుట్లయ్య

శింగనమల: ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలని సీఐ కౌలుట్లయ్య సూచించారు. శుక్రవా రం శింగనమల పోలీస్‌స్టేషన్‌లో రహదారి నిబంధనలపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరికీ డ్రైవింగ్ లైసెన్స్ , ఆర్సీలు, ఇన్సూరెన్స్ తప్పని సరిగా ఉండాలన్నారు. గతంలో అపరాధ రుసుంలు వేసి ఉంటే గ్రామ సచివాలయాల్లో చెల్లించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు పోలీసులను సంప్రదించి, పేర్లు నమోదు చేసుకుంటే డ్రైవింగ్ లైసెన్స్ వచ్చేలాచర్యలు తీసుకుంటామన్నారు. ఏఎస్ఐ చితంబరప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

గార్లదిన్నె/తాడిపత్రి రూరల్: గార్లదిన్నె మండలంలోని తలగాచిపల్లి క్రాస్ సమీపంలో ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా వాహనాలు తనిఖీ చేశారు. ఈసందర్భంగా పలు వాహనాలు ఆపి రికార్డులు పరిశీలించి, రికార్డులు సక్రమంగా లేని వారికి అపరాధ రుసుం విధించారు. అలాగే తాడిపత్రి సమీపంలోని సజ్జలదిన్నె క్రాస్‌లో సీఐ శివగంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

గార్లదిన్నె: బీసీ కార్పొరేషన్ రుణాల కోసం అర్హులైన లబ్ధిదారులు ఈనెల 7లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బీసీ ఉపకులాలు, ఈబీసీ వారు సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.1.75 లక్షలు నుంచి రూ.5 లక్షల వరకూ యూనిట్ విలువగల రుణాలను ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో అందజేస్తుందన్నారు. అర్హులు మీసేవ లేదా గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఫీజు పోరుకు తరలిరండి: కేతిరెడ్డి



ఫీజు పోరు పోస్టర్లు విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిటౌన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన ఫీజు పోరుకు తాడిపత్రి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్దఎత్తున హాజరు కావాలని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పిలుపునిచ్చారు. యల్లనూరు మండలంలోని స్వగ్రామం తిమ్మంపల్లిలో ఆయన ఫీజుపోరు పోస్టర్లను శుక్రవారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సకాలంలో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించక పోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది పిల్లలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి అండగా ఈ నెల 5న జిల్లా కేంద్రంలో ఫీజు పోరు కార్యక్రమం చేపడతామన్నారు. విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం ఆడుతున్న చెలగాటాన్ని వైఎస్సార్‌సీపీ సహించబోదన్నారు. కార్యకర్తలు, అభిమానులు, విద్యార్థులు తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తాడిపత్రి నియోజకవర్గ బూత్‌కమిటీ అధ్యక్షుడు రవితేజారెడ్డి, ఇంటలెక్చువల్ అధ్యక్షుడు నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం



తాడిపత్రిలో అలంకరణలో వాసవీమాత



గుత్తి వాసవీ మాత ఆలయంలో హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం



పామిడిలో వాసవీమాత పల్లకీ సేవ

తాడిపత్రి అర్బన్/తాడిపత్రి రూరల్/గుంతకల్లు/గుంతకల్లు టౌన్/గుత్తి/పామిడి: తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లోని వాసవీ మాత కన్యకాపరమేశ్వరీ ఆలయాల్లో శుక్రవారం ఆత్మార్పణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తాడిపత్రిలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో శుక్రవారం వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆర్యవైశ్యులు పట్టణంలో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 7గంటలకు శ్రీవాసవీమాతకు పుష్పయాగాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే మున్సిపల్ చైర్మన్ జేసీ.ప్రభాకర్‌రెడ్డి కుటుంబ సమేతంగా అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. పట్టణ సమీపంలోని ఐశ్వర్య విల్లాస్ వద్ద గల సర్కిల్‌లో వాసవీమాత విగ్రహం ఏర్పాటు కోసం జేసీ ప్రభాకర్‌రెడ్డి శంకుస్థాపన పనులు ప్రారంభించారు.

» గుంతకల్లులోని వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పట్టు వస్త్రాలను అందజేసి ప్రత్యేక పూజాలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, కమిషనర్ నయీమ్‌అహ్మద్‌ఆర్యవైశ్య సంఘం నాయకులు గోపా జగదీష్, కందూరి కృపాకర్, కౌన్సిలర్లు నీలావతి, చెన్నమ్మ, రంగమ్మ, కుమారి, మెప్మా టీపీఆర్‌ఓ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

» గుత్తి వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాకం శ్రీకాంత్, కిశోర్ బాబు, వాసవి మహిళా మండలి అధ్యక్ష, కార్యదర్శులు రాధ, కృష్ణవేణి, కోశాధికారి గీత, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

» పామిడిలోని కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. ఎంపీడీఓ తేజోత్స్న డిప్యూటీ డీఈఓ శ్రీదేవి, ఈఓ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు రెండు మద్యం షాపులు

గుత్తి: గుత్తికి రెండు అదనంగా మద్యం షాపులు మంజూరైనట్లు ఎక్సైజ్ సీఐ మోహన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గుత్తి మున్సిపాలిటీలో ఈడిగ కులానికి ఒక మద్యం షాపు, రూరల్‌లో గౌడ్ కులానికి ఒక మద్యం షాపు మంజూరైందన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఫిబ్రవరి 5న సాయంత్రం ఐదు గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.రెండు లక్షలు నాన్ రిఫండబుల్ సొమ్ముతో దరఖాస్తు చేయాలన్నారు. అయితే లైసెన్స్ ఫీజులో 50 శాతం రాయితీ ఉంటుందన్నారు. ఫిబ్రవరి 7న జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో లాటరీ పద్ధతిలో మద్యం షాపులు కేటాయిస్తారన్నారు.

నాటు సారా విక్రేత అరెస్ట్

గుంతకల్లు: నాటు నారాను తరలిస్తున్న ఓ వ్యక్తి అరెస్ట్ చేయడంతోపాటు 90 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐలు శివసాగర్, సుభాషిణి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం వారు మాట్లాడుతూ కసాపురం–మద్దికెర రహదారిలోని నంచెర్ల క్రాస్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ ఆటోలో నాటునారాను గుర్తించామన్నారు. కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన హరిజన తరుణ్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. అదేవిధంగా నాటుసారా తరలిస్తున్న కాలప్పనాయక్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. అసాంఘిక చర్యలు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో ఎస్ఐలు సుశీలమ్మ, వెంకటేశం, హెడ్ కానిస్టేబుళ్లు మారుతి, సురేష్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతను ఆదుకోవాలని వినతి

గుంతకల్లు: పట్టణ జనాభాకు అనుగుణంగా మున్సిపాలిటీ పరిధిలోని నిరుద్యోగ యువతకు బీసీ కార్పొరేషన్ కింద రుణాలు మంజూరు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వంశీకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహమ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో దాదాపు 1.50 లక్షలు జనాభాపైగా ఉన్నారని, అందులో వేలాది మంది నిరుద్యోగులు ఉన్నారన్నారు. కేవలం 117 మందికి మాత్రమే బీసీ కార్పొరేషన్ కింద రుణాలు మంజూరు చేస్తానడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. కనీసం 1000 మంది యువతకు రుణాలివ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు యశ్వంత్, వేణుగోపాల్, సాయి, పునీత్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ద్విచక్ర వాహనం అపహరణ

తాడిపత్రిటౌన్: ద్విచక్ర వాహనం అపహరణకు గురైందని బాధితుడు ఉదయ్‌కుమార్ పోలీసులకు శుక్రవారం పిర్యాదు చేశాడు. వివరాలు.. కూరగాయల మార్కెట్ పక్కనే ఉన్న సూపర్ మార్కెట్‌లో ఆయన సరుకులు కొనుగోలు చేయడానికి వచ్చాడు. పార్కింగ్‌లో ద్విచక్రవాహనం ఉంచి లోనికి వెళ్లి వచ్చే సరికి.. ద్విచక్రవాహనం అపహరణకు గురైందని ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ గౌస్‌బాషా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

యాడికి: ద్విచక్రవాహనం అదుపు తప్పిన ఘటనలో ఓ వ్యక్తికి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాల మేరకు.. గుంతకల్లుకు చెందిన రాజు ద్విచక్రవాహనంలో రాయలచెరువుకు బయలుదేరాడు. గుత్తిరోడ్డులోని రైస్ మిల్లు ఎదురుగా వాహనం అదుపుతప్పి కింద పడటంతో రాజుకు కాలు విరిగింది. స్థానికులు వెంటనే రాయలచెరువులో ఉన్న అతడి మేనమామ రంగడుకు సమాచారమిచ్చారు. ఆయన వచ్చి రాజును ఓ వాహనంలో అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

స్కూటరిస్టుకు గాయాలు

పామిడి: పట్టణంలోని వైజంక్షన్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దవడుగూరు మండలం మిడుతూరుకు చెందిన సూర్యనారాయణరెడ్డి గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. సూర్యనారాయణరెడ్డి ద్విచక్రవాహనంలో పామిడికి బయలుదేరాడు. అలాగే గుత్తి నుంచి వచ్చిన కారు పామిడిలోకి రావడానికి ప్రయత్నించి స్కూటర్‌ను ఢీ కొని వెళ్లింది. ప్రమాదంలో సూర్యనారాయణ రెడ్డి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గొలుసు లాక్కునే యత్నం..

తాడిపత్రి రూరల్: పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లి కాలనీలో శుక్రవారం తెల్లవారుజామున మహిళ మెడలోని బంగారు గొలుసు లాక్కోనేందుకు ఇద్దరు వ్యక్తులు ప్రయత్నించారని పోలీసులు తెలిపారు. వివరాలు.. గన్నెవారిపల్లి కాలనీలో కిరాణ్ షాపు నిర్వహిస్తున్న విజయలక్ష్మి వద్దకు ద్విచక్ర వాహనంలో ఇరువురు వ్యక్తులు వచ్చారు. వారిలో ఒకరు మోటర్ సైకిల్‌పై ఉండగా మరో వ్యక్తి సిగరెట్ కోసం వచ్చాడు. సిగరెట్ తీసుకునే నిమిత్తం ముందుకు వచ్చి ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కునే ప్రయత్నం చేయగా తెగిపోయి మెడలోనే ఉండిపోయింది. ఆమె పెద్ద ఎత్తున కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు పరుగున వచ్చారు. వారి రాకతో దొంగలు ఇద్దరూ బైక్‌పై అక్కడి నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి బాధితురాలిని విచారణ చేశారు.

మట్టి తరలిస్తే కఠిన చర్యలు

యల్లనూరు: మండలంలో బంజరు, ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు రాజా హెచ్చరించారు. శుక్రవారం తహసీల్దారు మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు చేయరాదన్నారు. ఎక్కడైనా ఫిర్యాదులు వస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

పౌరహక్కులను పరిరక్షించుకోవాలి

పామిడి: అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం కల్పించిన హక్కులను దళితులు పరిరక్షించుకోవాలని తహసీల్దార్ ఎస్.శ్రీధరమూర్తి సూచించారు. శుక్రవారం మండలంలోని ఎద్దులపల్లి గ్రామ దళిత కాలనీలో నిర్వహించిన పౌరహక్కుల పరిరక్షణ అవగాహన కార్యక్రమానికి తహసీల్దార్‌తో పాటు ఎంపీడీఓ కే తేజోత్స్న హాజరై మాట్లాడారు. బడుగు, బలహీన వర్గా అభ్యున్నతే ధ్యేయంగా అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. ప్రతి ఒక్కరూ పౌరహక్కులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ జీ వెంకటరమణమ్మ, ఏఎస్ఐ నాగరాజు, వార్డెన్ ఆదినారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం



గుంతకల్లులో కాలేజీని మూసివేయిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు



గుత్తిలో విద్యాసంస్థల బంద్‌ను నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

గుంతకల్లుటౌన్/గుత్తి/పామిడి: అనంతపురంలో ఇంటర్ విద్యార్థి కారణమైన నారాయణ కాలేజీ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయకపోవడాన్ని నిరసిస్తూ శుక్రవారం వైఎస్సార్‌ఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాలు చేపట్టిన ప్రైవేట్ విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. విద్యార్థి సంఘాల నాయకులు ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలను మూసివేయించగా పలు సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. గుంతకల్లులోని పొట్టిశ్రీరాములు సర్కిల్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి వంశీయాదవ్, నియోజకవర్గ అధ్యక్షుడు నక్కానారప్ప, ఎస్ఎఫ్ఐ నియోజకవర్గ కార్యదర్శి వెంకటేష్, ఏఐఎస్ఎఫ్ నాయకులు అఖిల్, శివమణి మాట్లాడారు. ఫీజు చెల్లించలేదన్న కారణంతో నారాయణ కాలేజీ యాజమాన్యం వేధింపులకు గురిచేయడంతో చరణ్ అనే విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడని వారు ఆరోపించారు. ఈ ఘటనపై విచారణ చేసి చర్యలు చేపట్టాల్సిన ఆర్ఐఓ కాలేజీకి తొత్తుగా మారాడని, అతడిని వెంటనే సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ స్పందించి కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు అంజి, అనిల్, రాజశేఖర్‌యాదవ్, అశోక్, కేశవ తదితరులు పాల్గొన్నారు.

■ గుత్తి మున్సిపాలిటీ వ్యాప్తంగా శుక్రవారం ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు తలపెట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతం అయింది. నారాయణ విద్యా సంస్థలను సీజ్ చేయాలని, ఆర్ఐఓను సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐఎస్‌వైఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు రమేష్, మోహన్ నాయక్, రవి తదితరలు పాల్గొన్నారు.

■ పామిడిలో నిర్వహించిన విద్యాసంస్థల బంద్‌లో హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు బీ మోహన్ నాయక్, ఎస్ఎఫ్ఐ, హెచ్‌డీఎస్ఎస్ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు. నారాయణ కాలేజీ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.